
మాట్లాడుతున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు

## చెరువు మత్తడి దుంకుతుందంటే కాళేశ్వరం పుణ్యమే..

**మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు**

సిద్దిపేట కమాన్, ఏప్రిల్ 19: సిద్దిపేట రూరల్ మం డలం రాఘవాపూర్‌లో జరిగిన పెద్దమ్మ తల్లి ఉత్సవాల్లో మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెద్దమ్మ తల్లి అనుగ్రహం మనందరిపై ఉండాలన్నారు.. పెద్దమ్మ దీవెనతోనే ఏప్రిల్‌లో రాఘవాపూర్‌లో చెరువు మత్తడి దుంకుతుందంటే కేసీఆర్ కట్టిన కాళేశ్వరం ఫలితమే అన్నారు. నేడు రాష్ట్రం ఆగమాగం అవుతుంది.. మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రజలను మోసం చేస్తుందన్నారు. మహాలక్ష్మి పథకం కింద మహిళలకు రూ.2500 ఇస్తామని ధోకా చేసిందన్నారు. తులం బంగారం ఇస్తానని టోకరా కొట్టిందన్నారు. ఇది కాంగ్రెస్ ప్రభుత్వంలో జరుగుతున్న మోసం, ప్రజలకు పాలు ఏందో, నీళ్లు ఏందో తెలిసిందన్నారు. పెద్దమ్మ దయతో అన్నింటా శుభం జరగాలని, ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో నాయకులు, ముదిరాజ్ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## పండిన ప్రతి ధాన్యపు గింజను కొనాలి

**మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు**


తడిచిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌రావు

సిద్దిపేట, ఏప్రిల్ 19: కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం పెట్టుకొని రైతులను ఇబ్బంది పెట్టవదని, పండిన ప్రతి ధాన్యపు గింజను కొనుగోలు చేయాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. శనివారం చింతమడక ఐకెపి సెంటర్‌ను సందర్శించి అకాల వర్షానికి తడిచిన ధాన్యాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా సివిల్ సప్లై, రెవెన్యూ అధికారులతో ఎమ్మెల్యే హరీశ్‌రావు ఫోన్‌లో మాట్లాడారు. అకాల వర్షాలకు పాలమాకుల, చింతమడక ఇతర గ్రామాల్లో ధాన్యం తడిచి రైతులు ఆందోళనలో ఉన్నారని తెలిపారు. వెంటనే ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలని సూచించారు. త్వరితగతిన రైస్‌మిల్స్‌ను కేటాయించి ధ్యాన్యాన్ని కొనుగోలు చేయాలన్నారు. వర్షంలో తడిచిన ధాన్యాన్ని కేంద్రాల వద్దనే పెట్టుకొని రైతులను తిప్పలు పెట్టొద్దన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో టార్పాలిన్ కవర్లు ఏర్పాటు చేయాలని, ధాన్యం తడవకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఇప్పటికే 8 గ్రామాల్లో ధాన్యం తడిచి రైతులు ఆందోళనలో ఉన్నారని, రైతులెవ్వరూ కూడా ఆందోళన చెందవద్దని సూచించారు.

## స్వర్ణోత్సవాలు ఘనంగా నిర్వహించాలి

**మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు**


ఆలయ నిర్వాహకులకు రూ.లక్షా 116ల విరాళం అందజేస్తున్న హరీశ్‌రావు

సిద్దిపేట, ఏప్రిల్ 19: వచ్చేనెల 19 నుండి ప్రారంభయ్యే పట్టణంలోని సుప్రసిద్ధ క్షేత్రం మోహినిపుర శ్రీ వెంకటేశ్వర దేవస్థానం 50వ వార్షిక బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహించాలని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు సూచించారు. శనివారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వెంకటేశ్వర స్వామి స్వర్ణోత్సవాల ఏర్పాట్లపై ఆలయ నిర్వాహకులతో సమీక్షా నిర్వహించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ ఉత్సవాల్లో చిన్నజీయర్ స్వామి పాల్గొంటారని, ఆ దిశగా అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఐదురోజుల పాటు జరిగే ఈ ఉత్సవాల్లో అన్నదాన దాతలను భాగస్వామ్యం చేయాలన్నారు. ఉత్సవాల నిర్వహణకు తన వంతుగా రూ.లక్షా 116లు విరాళంగా ప్రకటించి ఆలయ చైర్మన్, నిర్వాహకులకు అందజేశారు. కమిటీలు ఏర్పాటు చేసుకొని సమన్వయంతో ముందుకు సాగి ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించాలన్నారు. మున్సిపల్ మాజీ చైర్మన్ రాజనర్సు, చిన్నా, ఆలయ ప్రతినిధులు పాల్గొన్నారు.

## మైనార్టీలకు కష్టమొస్తే ఎవరికి చెప్పుకోవాలి?

- **ప్రభుత్వం ఏర్పడి ఏడాదైనా మైనార్టీలకు పదవులు ఇవ్వలేదు**
- **హజ్ యాత్రికులను సన్మానించిన మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు**


హజ్ యాత్రికులను సన్మానిస్తున్న హరీశ్‌రావు, ఫరూఖ్ హుస్సేన్

సిద్దిపేట, ఏప్రిల్ 19: తెలంగాణలో మైనార్టీలకు కష్టమొస్తే ఎవరికి చెప్పుకోవాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు ప్రశ్నించారు. హజ్ యాత్రికులను మాజీ ఎమ్మెల్సీ ఫరూఖ్ హుస్సేన్ ఆధ్వర్యంలో ఆయన సిద్దిపేటలో శనివారం సన్మానించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ... బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో మైనార్టీల కోసం పాటుపడ్డామని, ప్రతి ఏడాది రూ.1500 నుంచి రూ. 1800 కోట్ల బడ్జెట్ ఖర్చు పెట్టామన్నారు. కాంగ్రెస్ హయాంలో బడ్జెట్ రూ.3 వేల కోట్లు ప్రకటించి కేవలం రూ.200 కోట్లు మాత్రమే ఖర్చు పెట్టారని, మిగతా రూ. 800 కోట్లు కేసీఆర్ స్థాపించిన మైనార్టీ రెసిడెన్షియల్ స్కూల్స్‌కి ఖర్చు పెట్టారన్నారు. మిగతా రూ. 2వేల కోట్లు ఎక్కడ అని ప్రశ్నించారు. ప్రభుత్వం ఏర్పడి 15 నెలలైనా మంత్రి పదవి ఇవ్వడానికి ఇప్పటి వరకు మైనార్టీ నాయకుడే దొరకడం లేదా ప్రశ్నించారు. మైనార్టీలకు కష్టమొస్తే ఎవరికీ చెప్పుకుంటారన్నారు. అనంతరం మాజీ ఎమ్మెల్సీ ఫారూక్ హుస్సేన్ మాట్లాడుతూ హజ్ యాత్రికులు దేశం, రాష్ట్రం కోసం, శాంతి కోసం ప్రార్థనలు చేయాలన్నారు. తాను బతికున్నంత కాలం అందరికీ సేవ చేస్తానని తెలిపారు. తన జీవితంలో హరీశ్‌రావు, కేసీఆర్ లాంటి మంచి, నిస్వార్థ మనుషులను చూడలేదన్నారు. కార్యక్రమంలో ముస్లింలు, ముస్లిం మతపెద్దలు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాలను పరామర్శించిన ఎమ్మెల్యే


భార్గవ్ కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

రాయపోల్, ఏప్రిల్ 19: మండలంలోని అనాజీపూర్‌కు చెందిన బీఆర్‌ఎస్ యువజన నాయకులు ఉప్పల భార్గవ్ నానమ్మ బాలమ్మ ఇటీవల మృతిచెందింది. విషయం తెలుసుకున్న దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి భార్గవ్ కుటుంబాన్ని శనివారం పరామర్శించారు. ఆమె మృతిపట్ల ప్రగాఢ సంతాపం ప్రకటించారు. అలాగే మంతూర్‌కు చెందిన బీఆర్‌ఎస్ నాయకులు బండారు శ్రీనివాస్‌గౌడ్ కుమారుడు నితిన్‌గౌడ్ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా, బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన వెంట మండల పార్టీ అధ్యక్షులు వెంకటేశ్వర శర్మ, మాజీ జడ్పీటీసీ యాదగిరి, మాజీ కో అప్షన్ సభ్యులు ఫర్వేజ్, బీఆర్‌ఎస్ మండల ఉపాధ్యక్షులు వెంకట్‌గౌడ్, యువజన నాయకులు రాజిరెడ్డి, దయాకర్, శ్రీనివాస్, మండల యూత్ అధ్యక్షులు దయాకర్‌రెడ్డి ఉన్నారు.

## విద్యార్థులు ఉత్తమ పౌరులుగా ఎదగాలి

**మాజీ ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి**


చిన్నారికి గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్‌ను అందజేస్తున్న రఘోత్తంరెడ్డి

సిద్దిపేట టౌన్, ఏప్రిల్ 19: విద్యార్థి దశ చాలా కీలకమని, విద్యార్థులు బాగా చదివి ఉత్తమ పౌరులుగా ఎదగాలని మాజీ ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి సూచించారు. సిద్దిపేట రావుస్ పాఠశాల వార్షికోత్సవం శనివారం ఘనంగా జరిగింది. కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై చిన్నారులకు గ్రాడ్యుయేషన సర్టిఫికేట్లను అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ మురళీకృష్ణ, పాఠశాల సీఎండీ నితిన్‌రావు, ప్రిన్సిపల్ తిరుపతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# రజతోత్సవ సభకు లక్షలాదిగా తరలుదాం

- **బీఆర్‌ఎస్ గజ్వేల్ నియోజవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి, ఎమ్మెల్సీ యాదవరెడ్డి**


కొండపాక మండలం దుద్దెడలో రజతోత్సవ సభ వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వంటేరు ప్రతాప్‌రెడ్డి, ఎమ్మెల్సీ యాదవరెడ్డి


కుకునూరుపల్లిలో వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వంటేరు ప్రతాప్‌రెడ్డి, యాదవరెడ్డి

కొండపాక(కుకునూరుపల్లి), ఏప్రిల్ 19: ఈనెల 27న వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో నిర్వహించే బీఆర్‌ఎస్ రజతోత్సవ సభకు లక్షలాదిగా తరలుదామని బీఆర్‌ఎస్ గజ్వేల్ నియోజవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి, ఎమ్మెల్సీ యాదవరెడ్డి అన్నారు. శనివారం మండలంలోని దుద్దెడ వైష్ణవి గార్డెన్స్‌లో, కుకునూరుపల్లి మండల కేంద్రంలోని కోల ఆంజనేయులు గార్డెన్స్‌లో జరిగిన బీఆర్‌ఎస్ సన్నాహక సమావేశాల్లో వారు మాట్లాడారు. ప్రతి ఊరూవాడ నుంచి ఉప్పెనలా గులాబీ దండు కదిలి ఎల్కతుర్తి సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సభతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల గుండెల్లో రైళ్లు పరిగెత్తడం ఖాయమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలపై ఎక్కడికక్కడ నిలదీయాలని, కాంగ్రెస్ 70 సంవత్సరాల పాలనలో అభివృద్ధి శూన్యమన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కేసీఆర్ పాలనలో రాష్ట్రం అంచెలంచెలుగా అభివృద్ధిలో ఎదిగి దేశంలో ముందు వరుసలో నిలిచిందన్నారు. కేసీఆర్ పదేళ్ల పాలన స్వర్ణయుగంగా నిలిచిందని అన్నారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో 3లక్షల టన్నుల వరి ధాన్యాన్ని పండించి దేశానికి అన్నంపెట్టిన రాష్ట్రంగా తెలంగాణ నిలిచిందన్నారు. రైతు బంధు నాయకుడంటే కేసీఆర్ మాత్రమేనని, గజ్వేల్‌ను అన్నిరంగాల్లో అభివృద్ధి చేశారన్నారు. కేసీఆర్ హయాంలో భూముల ధరలు పెరిగితే కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో దివాళా తీశాయన్నారు. అనంతరం రజతోత్సవ సభ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాజీ గ్రంథాలయ చైర్మన్ లక్కిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎంపీటీసీల ఫోరం రాష్ట్ర మాజీ వర్కింగ్ ప్రెసిడెంట్ దేవి రవీందర్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ అమరేందర్, మాజీ వెస్ ఎంపీపీ భగవాన్, ఎన్‌ఆర్‌జీఎస్ రాష్ట్ర మాజీ కౌన్సిల్ సభ్యురాలు కోల సద్గుణ రవీందర్, బీఆర్‌ఎస్ ఉమ్మడి కొండపాక మండలాధ్యక్షుడు నూనె కుమార్‌యాదవ్, భారత జాగృతి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రశాంత్, మాజీ ఎంపీపీలు కనకయ్య, రాధాకిషన్‌రెడ్డి, రైతుబంధు సమితి మాజీ మండల కో ఆర్డినేటర్ ర్యాగల దుర్గయ్య, మాజీ ప్రజా ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

## రజతోత్సవ సభకు తరలిరండి


చేర్యాలలో పోస్టర్లు అవిష్కరిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు


కోహెడ: సముద్రాలలో మాట్లాడుతున్న నాయకులు.

చేర్యాల, ఏప్రిల్ 19: ఈనెల 27న వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో నిర్వహించనున్న బీఆర్‌ఎస్ రజతోత్సవ సభకు వేలాదిగా తరలిరావాలని ఆ పార్టీ పట్టణ మహిళా అధ్యక్షురాలు తాడెం రంజితాకృష్ణమూర్తి కోరారు. శనివారం నాడామె బీఆర్‌ఎస్ పార్టీ నాయకులతో కలిసి పట్టణంలో ఇంటింటా తిరుగుతూ సభకు తరలిరావాలని కోరుతూ వాల్‌పోస్టర్లను అతికించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ టౌన్ అధ్యక్షుడు నాగేశ్వర్‌రావు, సీనియర్ నాయకులు శ్రీధర్‌రెడ్డి, పట్టణ ప్రధాన కార్యదర్శి హరి, కార్యదర్శి తిరుపతిగౌడ్, యూత్ అధ్యక్షుడు భిక్షపతి, నాయకులు బాబు, రాము, అనిల్, దేవయ్య పాల్గొన్నారు.

**కోహెడలో...**

కోహెడ ఏప్రిల్ 19: ఈనెల 27న వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో జరుపతలపెట్టిన బీఆర్‌ఎస్ రజతోత్సవ సభకు పార్టీ శ్రేణులు భారీగా తరలిరావాలని మండల బీఆర్‌ఎస్ నాయకులు పిలుపునిచ్చారు. శనివారం మండలంలోని పలు గ్రామాలలో నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. కార్యక్రమాలలో నాయకులు మహేందర్, లక్ష్మణ్, రాజిరెడ్డి, సురేశ్, శ్రీనివాస్‌రెడ్డి, రాంరెడ్డి, తిరుపతి, అయిలయ్య, గాల్‌రెడ్డి, శ్రీధర్, రాజిరెడ్డి తదితరులున్నారు.

## డాక్యుమెంట్ రైటర్స్ నిరసన


చేర్యాలలో నిరసన వ్యక్తం చేస్తున్న డాక్యుమెంట్ రైటర్స్

చేర్యాల, ఏప్రిల్ 19: కాంగ్రెస్ ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెడుతున్న స్లాట్ బుకింగ్ విధానాన్ని రద్దుచేసి పాత విధానాన్ని కొనసాగించాలని చేర్యాల డాక్యుమెంట్ రైటర్స్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. నూతన స్లాట్ బుకింగ్ విధానానికి నిరసనగా శనివారం డాక్యుమెంట్ రైటర్స్ నల్లబ్యాడ్జీలు ధరించి రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అంజిరెడ్డి, కృష్ణమూర్తి, వెంకటస్వామి, నవీన్, బుచ్చిబాబు, రవిచంద్ర, భరత్, వెంకటేష్, చందు, సంపత్, కిరణ్‌కుమార్, రాజేష్ పాల్గొన్నారు.

**గజ్వేల్‌లో...**

గజ్వేల్, ఏప్రిల్ 19: ప్రభుత్వం ఇటీవల చేపట్టిన రిజిస్ట్రేషన్ ప్రక్రియలో భాగంగా స్లాట్ బుకింగ్ విధానంతో ప్రజలు, తాము ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయం ఎదుట శనివారం డాక్యుమెంట్ రైటర్స్ నిరసన తెలిపారు. అనంతరం రిజిస్ట్రార్ రాజేష్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో డాక్యుమెంట్ రైటర్స్ సంఘం అధ్యక్షుడు హమీద్, సభ్యులు ధనుష్, కుమార్, మసూద్, ప్రసాద్, మల్లేశం, నరేందర్, నవీన్ పాల్గొన్నారు.

## దారుల మూసివేతపై బీఆర్‌ఎస్ నేతల నిరసన


నిరసన తెలుపుతున్న బీఆర్‌ఎస్ నాయకులు


హుస్నాబాద్‌టౌన్, ఏప్రిల్ 19: మున్సిపల్ కార్యాలయానికి చేరుకోకుండా దారులను మూసివేసిన అధికారుల తీరుపై బీఆర్‌ఎస్ నాయకులు శనివారం కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. విశాలమైన స్థలంలో నూతనంగా మునిసిపల్ కార్యాలయాన్ని నిర్మించినప్పటికీ ప్రజలు కార్యాలయానికి రాకుండా దారులను మూసివేయడంపై వారు మండిపడ్డారు. కార్యాలయానికి చేరుకోకుండా తాళ్లు, బోర్డులను అడ్డుగా పెట్టడం ఏమిటని ప్రశ్నించారు. దారులు మూసివేసే చర్యలను ఉపసంహరించుకోవాలని మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్‌గౌడ్‌కు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నియోజకవర్గ అధికార ప్రతినిధి మల్లికార్జున్‌రెడ్డి, నాయకులు నవీన్‌రావు, వికాస్‌యాదవ్, జగ్జీవన్‌రామ్, అరవింద్, సునీత ఉన్నారు.

## డబుల్ బెడ్‌రూం ఇండ్ల నిర్మాణాన్ని పూర్తిచేయండి


కమిషనర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న లబ్ధిదారులు, బీఆర్‌ఎస్ నాయకులు

హుస్నాబాద్‌టౌన్, ఏప్రిల్ 19: పట్టణంలో చేపడుతున్న డబుల్ బెడ్‌రూం ఇండ్ల నిర్మాణాన్ని సకాలంలో పూర్తి చేసి లబ్ధిదారులకు అందించాలని బీఆర్‌ఎస్ నియోజకవర్గ అధికార ప్రతినిధి అయిలేని మల్లికార్జున్‌రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం బీఆర్‌ఎస్ నాయకుల ఆధ్వర్యంలో లబ్ధిదారులు అధికారులను కలిశారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో అర్హులైన తమకు ఇండ్లను కేటాయింపు జరిగిందని, ప్రభుత్వం పట్టాలు సైతం ఇవ్వడం జరిగిందని తెలిపారు. ఇందులో దాదాపు 75శాతం ఇండ్లు పూర్తి చేశారని, మిగితా నిర్మాణ పనులు పూర్తి చేసే దశలో అసెంబ్లీ ఎన్నికలు రావడంతో నిలిచి పోయాయని, మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ చొరవ తీసుకోవాలన్నారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్‌గౌడ్‌కు వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు నవీన్‌రావు, వికాస్‌యాదవ్, జగ్జీవన్, అరవింద్, లబ్ధిదారులు సునీత, సువర్ణ, ప్రమీళ, సరిత, శారద తదితరులు పాల్గొన్నారు.

## వైద్య ఉద్యోగులు, సిబ్బంది నిరసన


కార్మిక శాఖ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న సీఐటీయూ నాయకులు, దవాఖాన సిబ్బంది

గజ్వేల్, ఏప్రిల్ 19: ఐదు నెలలుగా తమకు వేతనాలు చెల్లించక పోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని ప్రజ్ఞాపూర్‌లోని అతిథి దవాఖానలో పనిచేస్తున్న వైద్యులు, సిబ్బంది ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు శనివారం పట్టణంలోని కార్మిక శాఖ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం చేపట్టారు. దవాఖాన యజమాన్యం తీరుపై చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని అధికారులకు సమర్పించిన వినతి పత్రంలో కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకుడు స్వామి, వైద్యులు యుగేందర్, సంతోష్, హరిశంకర్, రాజు, జమీర్, సిబ్బంది పాల్గొన్నారు.

## ధాన్యాన్ని దళారులకు అమ్మొద్దు: ఎమ్మెల్యే


బెజ్జంకి: దాచారంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

బెజ్జంకి, ఏప్రిల్ 19: రైతులు దళారులకు ధాన్యం అమ్మి మోసపోవద్దని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ కోరారు. మండలంలోని దాచారం, కల్లెపల్లి, గుగ్గిళ్ల గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను శనివారం ఆయన ప్రారంభించారు. అనంతరం సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను బాధిత కుటుంబాలకు అందించారు. కార్యక్రమాల్లో మార్కెట్ కమిటీ చైర్మన్ పులి కృష్ణ, తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీడీవో ప్రవీణ్, ఏపీఎం నర్సయ్య, నాయకులు, మహిళ సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

**దళారులకు ధాన్యాన్ని అమ్మి మోసపోవద్దు**

మద్దూరు(ధూళిమిట్ట), ఏప్రిల్ 19: రైతులు పండించిన ధాన్యాన్ని దళారులకు అమ్మి మోసపోవద్దని ధూళిమిట్ట తహసీల్దార్ సింహాచలం మధుసూదన్ అన్నారు. శనివారం లింగాపూర్‌లో ఉజ్వల గ్రామైక్య సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ఏపీఎం బాబురావు, సీసీ మహేందర్, మాజీ సర్పంచ్ కనకయ్య, ఉజ్వల గ్రామైక్య సంఘం అధ్యక్షురాలు లక్ష్మి, వీవోఏ వినోద, గ్రామస్తులు పాల్గొన్నారు.

## భూ సమస్యలపై అప్పీల్ చేసుకోవచ్చు

- **కలెక్టర్ మనుచౌదరి**


చిన్నకోడూరు: మాట్లాడుతున్న కలెక్టర్

చిన్నకోడూరు/నారాయణరావుపేట, ఏప్రిల్ 19: భూ సమస్యలపై భూభారతి చట్టం ప్రకారం అప్పీల్ చేసుకునే అవకాశం ఉందని కలెక్టర్ మనుచౌదరి అన్నారు. చిన్నకోడూరు, నారాయణరావుపేట మండల కేంద్రాల్లోని రైతువేదికల్లో నిర్వహించిన భూభారతి చట్టం అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ముందుగా భూభారతి చట్టంలోని వివిధ అంశాలను అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్ రైతులకు, ప్రజలకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. కలెక్టర్ మాట్లాడుతూ భూసమస్యలపై ఆర్డీవో, కలెక్టర్, ట్రిబ్యునల్ వద్ద అప్పీల్ చేసుకోవచ్చని సూచించారు. కార్యక్రమంలో ఆర్డీవో సదానందం, మండల స్పెషలాఫీసర్లు, జయదేవ్ ఆర్యా, శ్రీనివాస్‌రెడ్డి, తహసిల్దార్లు హరికిరణ్, లక్ష్మణ్‌రావు, రైతులు పాల్గొన్నారు.

**దళారులకు ధాన్యాన్ని అమ్ముకోవద్దు**

చిన్నకోడూరు, ఏప్రిల్ 19: రైతులు పండించిన ధాన్యాన్ని దళారులకు విక్రయించి నష్టపోవద్దని కలెక్టర్ మనుచౌదరి సూచించారు. శనివారం మండలంలోని పెద్దకోడూరు ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన సందర్శించారు. కలెక్టర్ వెంట డీఆర్‌డీఓ జయదేవ్ ఆర్యా, ఎంపీడీవో ఉన్నారు.

## అకాల వర్షంతో అన్నదాతకు తీరని నష్టం


మద్దూరు(ధూళిమిట్ట): లద్నూర్‌లోని కొనుగోలు కేంద్రంలో తడిసిన ధాన్యం


మద్దూరు(ధూళిమిట్ట), ఏప్రిల్ 19: మద్దూరు మండల కేంద్రంతో పాటు మండలంలోని సలాఖపూర్, మర్మాముల, ధర్మారం, లద్నూర్, రేబర్తి, వంగపల్లి, వల్లంపట్ల, గాగిళ్లాపూర్, నర్సాయపల్లి గ్రామాలలో శనివారం కురిసిన వడగండ్లకు వరి పంటతో పాటు మామిడితోటలు దెబ్బతిన్నాయి. కొనుగోలు కేంద్రాలలో ధాన్యం తడిసిముద్దయింది. వర్షానికి మామిడి తోటల్లో చెట్లు విరిగిపోవడంతో పాటు మామిడి కాయలు రాలిపోయాయి. దీంతో రైతులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. దెబ్బతిన్న పంటలకు ప్రభుత్వం పరిహారం అందించాలని, తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

**నాగపురిలో...**

చేర్యాల, ఏప్రిల్ 19: మండలంలోని నాగపురిలో శనివారం కురిసిన అకాల వర్షానికి ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంలో ధాన్యం తడిసిపోయింది. వాతావరణంలో మార్పును గమనించిన పలువురు రైతులు హుటహుటిన టార్పలిన్ కవర్లు ధాన్యం కుప్పలపై కప్పగా, బలమైన గాలులకు అవి ఎగిరిపోయాయి.

## దాడులు జరుగుతున్నా నోరుమెదపని కేంద్రం

**ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మీ**


మాట్లాడుతున్న మల్లు లక్ష్మీ

చేర్యాల, ఏప్రిల్ 19: మహిళలు పోరాడి సాధించుకున్న హక్కులతో పాటు రాజ్యాంగపరంగా వచ్చిన హక్కులను అమలు చేయడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మీ విమర్శించారు. అంబేద్కర్, పూలే జయంతిలను పురస్కరించుకుని ఐద్వా రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా మహిళా హక్కుల పరిరణ బస్సుయాత్ర చేపట్టారు. శనివారం బస్సుయాత్ర చేర్యాలకు చేరుకున్న సందర్భంగా స్థానిక అంబేద్కర్ సెంటర్ వద్ద ప్రజా సంఘాల నాయకులు యాత్రకు ఘన స్వాగతం పలికారు. అనంతరం యాత్ర బృందం సభ్యులు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మల్లు లక్ష్మీ మాట్లాడుతూ మహిళలపై జరుగుతున్న దాడులు, హింస, హత్యలు, అత్యాచారాలు, కుల దురహంకార హత్యలపై కేంద్రం నోరు మెదపడం లేదన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షురాలు అరుణజ్యోతి, ఉపాధ్యక్షురాలు ఆశాలత, కమిటీ సభ్యురాలు సాయిలీల, జిల్లా కార్యదర్శి శారద, కమిటీ సభ్యురాలు పరమేశ్వరి, శోభ, సరిత, మనస్విని, ప్రజా సంఘాల నాయకులు యాదవరెడ్డి, సత్తిరెడ్డి, వెంకట్ మావో, అరుణ్‌కుమార్, రవీందర్, నాగరాజు, అశోక్, మల్లేశం, ప్రవీణ్ పాల్గొన్నారు.

## ఇంటర్ విద్యలో తెలుగు రద్దు తగదు

సిద్దిపేట టౌన్, ఏప్రిల్ 19: ఇంటర్ విద్యలో తెలుగు భాషను రద్దు చేసి సంస్కృత భాషను పెట్టాడాన్ని ప్రభుత్వం తక్షణమే విరమించుకోవాలని కవులు, రచయితలు, భాషోపాధ్యాయులు డిమాండ్ చేశారు. మంజీర రచయితల సంఘం ఆధ్వర్యంలో శనివారం రాత్రి సిద్దిపేటలోని ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో వారు మాట్లాడారు. ఇంటర్ విద్యలో తెలుగును ప్రభుత్వం రద్దు చేయడం తెలుగు భాషను అవమానించడమేనన్నారు. తెలుగు భాషను ప్రాచీన భాషను గుర్తించిన సందర్భంలో ఇలాంటి చర్యలు చేపట్టడం తగదన్నారు. కార్యక్రమంలో జర్నలిస్టు సంఘం జిల్లా అధ్యక్షుడు రంగాచారి, వక్తలు మహేందర్‌రెడ్డి, శివరాజ్యం, యాదగిరి, బాలయ్య, సుధాకర్, సయ్యద్, యాదగిరి పాల్గొన్నారు.

## సంస్కృతి, సంప్రదాయాలు పాటించాలి



సందేశమిస్తున్న హంపీ పీఠాధిపతి విరూపాక్ష విద్యారణ్య భారతిస్వామి

మిరుదొడ్డి, ఏప్రిల్ 19: భారతీయ సంస్కృతి సనాతన ధర్మం ఎంతో శ్రేష్ఠమైనదని హంపీ పీఠాధిపతి విరూపాక్ష విద్యారణ్య భారతిస్వామి అన్నారు. శనివారం మిరుదొడ్డి మండలం అందె గ్రామంలో శంభుని దేవాలయం వద్ద భానలింగార్చన కార్యక్రమంలో 350 కుటుంబాలు పాల్గొన్నాయి. ఈ సందర్భంగా హంపీ పీఠాధిపతి విరూపాక్ష విద్యారణ్య భారతిస్వామి భక్తులకు సందేశమిస్తూ హిందూ సంస్కృతి సంప్రదాయాలను గ్రామాల్లోని ప్రజలు ప్రతిఒక్కరూ పాటించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రసాద్, శివలింగం, రామచంద్రం, యాదగిరి, సుమన్ పాల్గొన్నారు.

## పరామర్శ

జగదేవపూర్, ఏప్రిల్ 19: బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పనుగట్ల శ్రీనివాస్‌గౌడ్‌ను శనివారం ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్, బీఆర్‌ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి పరామర్శించారు. ఇటీవల శ్రీనివాస్‌గౌడ్ జగదేవపూర్‌లోని తన ఇంటి వద్ద ప్రమాదవశాత్తు కిందపడటంతో కాలువిరగగా, హైదరాబాద్‌లోని ఓ దవాఖానలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న వంటేరు ప్రతాప్‌రెడ్డి శ్రీనివాస్‌గౌడ్‌ను కలిసి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు.

## పోషణ పక్షోత్సవాలు

చేర్యాల, ఏప్రిల్ 19: మండలంలోని ఆకునూరు అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం ప్రీ స్కూల్ గ్యాడ్యుయేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రీ స్కూల్ పిల్లలతో పాటలు, కథలు చెప్పించడంతో పాటు ఆటలు నిర్వహించారు. అనంతరం తల్లిదండ్రులకు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీఆర్పీ సత్యలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్లు ఉమారాణి, ప్రణీత, విజయ, పీఈటీ కవిత, వీవో అధ్యక్షురాలు జయమ్మ పాల్గొన్నారు.

## అందుబాటులో ఉండి సేవలందిస్తా..

సిద్దిపేట కమాన్, ఏప్రిల్ 19: అఖిల భారతీయ విశ్వకర్మ పరిషత్ నియమ నిబంధనలు పాటిస్తూ జిల్లా స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ సేవలందిస్తానని ఆ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బాసంపల్లి నరసింహాచారి అన్నారు. శనివారం విశ్వకర్మ పరిషత్ సభ్యులతో ఆయన సమావేశమయ్యారు. ఆయన్ని వారు ఘనంగా సన్మానించారు. తన నియమకానికి కృషిచేసిన వారికి నరసింహాచారి కృతజ్ఞతలు తెలిపారు.

## దర్గాలో చోరీ

చేర్యాల, ఏప్రిల్ 19: పట్టణంలోని కడవేర్గు రహదారి పక్కన గల అమీనొద్దీషా దర్గాలో గుర్తుతెలియని వ్యక్తులు హుండీని పగులగొట్టి నగదు దొంగలించారని ఆ దర్గా నిర్వాహకులు శనివారం తెలిపారు. హుండీలో దాదాపు రూ.10 నుంచి 15వేల వరకు నగదు ఉంటుందని తెలిపారు. మజీద్ కమిటీ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎస్ఐ నిరేష్ కేసు నమోదు చేసుకొని విచారణ ప్రారంభించారు.

## ఆయిల్ పామ్ సాగుతో అధిక లాభాలు

మిరుదొడ్డి, ఏప్రిల్ 19: రైతులు వరి, మొక్క జొన్న పంటలనే కాకుండా ఆయిల్ పామ్ తోటలు సాగు చేసి ఆర్థికంగా ఎదగాలని జిల్లా ఆయిల్ ఫెడ్ అధికారి భాస్కర్ రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రమైన మిరుదొడ్డి పట్టణంతో పాటు ఆయా గ్రామాల్లో ఏవో బోనాల మల్లేశంతో కలిసి ఆయిల్ పామ్ తోటలను సందర్శించారు. రైతులు ఆయిల్ పామ్ సాగుచేస్తే ప్రభుత్వం 90 శాతం సబ్సిడీ అందిస్తుందని రైతులకు సూచించారు. ఆయన వెంట ఉద్యానవన శాఖ అధికారి నరేశ్, రైతులు పాల్గొన్నారు.

## అభినందనల వెల్లువ

కొండపాక(కుకునూరుపల్లి), ఏప్రిల్ 19: కుకునూరుపల్లి మండలంలోని చిన్నకిష్టాపూర్ ప్రాథమిక పాఠశాలలో టాయిలెట్స్, వాటర్ ట్యాంకు, నల్లాలకు సంబంధించిన సమస్యలను హైదరాబాద్ యూత్ అసెంబ్లీ సభ్యులు శనివారం పరిష్కరించారు. ఇందుకు రూ. 20వేలు వెచ్చించారు. కాగా, హైదరాబాద్ యూత్ అసెంబ్లీ సభ్యులను, ఉపాధ్యాయుడు ప్రశాంత్‌గౌడ్‌ను, పాఠశాల ఉపాధ్యాయ బృందాన్ని గ్రామస్తులు అభినందించారు. కార్యక్రమంలో అశోక్, వెంకటేశం, రేఖ, సుధారాణి పాల్గొన్నారు.

**సర్టిఫికేట్ పోయినది**

**నేను, దేవరబోయిన కార్తీక్, తండ్రి:** దేవరబోయిన మహేందర్, నివాసం: నర్సాయిపల్లి, మద్దూర్ మండలం, సిద్దిపేట జిల్లా, తెలంగాణ. నా 10వ తరగతి (SSC) మార్చి, 2017 పబ్లిక్ పరీక్షలకు చెందిన ఒరిజినల్ సర్టిఫికేట్ పోయినది. హాల్ టిక్కెట్ నెం. 1712118816, TS రెసిడెన్షియల్ (బాలుర) హైస్కూల్, వేలేర్, వరంగల్ అర్బన్ జిల్లా. దొరికినవారు ఈ క్రింది నెంబర్లను సంప్రదించగలరు. వారికి తగిన పారితోషికం ఇవ్వబడును.

డి. రేణుక - 7095959887
డి. మహేందర్ - 9398627175